


# క్రౌంచవధ

- కొంపెల్ల లక్ష్మీసమీరజ

"రత్నాకరుడనే బోయవాడు తన ఆకలి తీర్చుకునేటందుకు చెట్టు కొమ్మ మీద నున్న క్రౌంచ మిథునాన్ని వధించాలనుకున్నాడు. అతడి శరాఘాతానికి బలైన మగపక్షి గిలగిలా తన్నుకుంటూ కింద పడింది..." రాఘవనాందస్వామి రామాయణప్రవచనం ప్రారంభిస్తూ చెపుతున్నారు. ఈ ఘట్టం నేనెప్పుడూ వినలేనిది! 'క్రౌంచమిథునం' అనే మాట వినేసరికల్లా మనఃకుహరంలో ధాం ధామ్మని పేలిన తుపాకి చప్పుళ్లూ-వెంటనే హృదయవిదారకంగా వినిపించే ఆక్రోశాలూ మార్మోగుతూ ఉంటాయి. మెల్లగా అక్కడ నుంచి లేచి గంగానది వద్దకు నడిచాను. ప్రశాంతంగా ప్రవహిస్తోంది గంగ! మనస్సును నింపే ఆ నిశ్శబ్దంలో-ఆ ప్రవాహశబ్దం మంద్రంగా వినిపిస్తోంది.

"సుహా... చెపుతున్నది నీకే! నడు లోపలకి... మీ అమ్మకి వంటలో సాయం చెయ్యి. తహసీల్దారూ, సర్పంచీ...ఇంకా పెద్దమనుషులంతా అక్కడ కూర్చుని ఉండగా, నువ్వు అక్కడకొచ్చి చాంద్‌బాయి నాట్యం చూస్తానంటావా? వాళ్లంతా నిన్నక్కడ చూస్తే ఏమనుకుంటారు? నడు, లోపలికెళ్లు!"

'సుహా'ని లోపలకు తోస్తూ నాన్న గట్టిగా అరవటం వినిపించింది . ఆ రోజు నాకింకా కళ్లకు కట్టినట్టు ఉంటుంది. నాన్న చాంద్‌బాయి నాట్యం చూడటానికి వెళ్లిపోయిన తరువాత సుహా అక్కడే నేలకి అతుక్కుపోయినట్లుగా నిల్చుని ఉంది. తన కళ్లల్లో తిరస్కారం కనిపిస్తోంది. మనస్సులో ప్రబలంగా పెల్లుబికిన పగని గొంతులోనే నొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. మెల్లగా నేను తన దగ్గరకు వెళ్లాను.

"సుహా... అక్కడ కూర్చున్న వాళ్లంతా చాలా పెద్దవాళ్లురా! ఆడవాళ్లని గౌరవించటం వాళ్లకి చేత కాదు. స్త్రీ అంటే భోగవస్తువు వాళ్ల దృష్టిలో. అందుకే చాంద్‌బాయి వెంటపడుతున్నారు. అటువంటి చోటికి నువ్వు వెళ్లటం అస్సలు మంచిది కాదు. అందుకే వద్దన్నారు నాన్న" మృదువుగా తన తల నిమురుతూ చెప్పాను. నాన్నలోని పురుషాధిక్యభావన నాకు తెలియనది కాదు.

'నిజంగానా...' అన్నట్లు చూసింది సుహా-'నీవూ పురుషుడివేగా' అన్నట్లుంది ఆ చూపు.

అవునన్నట్లు తల ఊపాను- చూపు తిప్పి తప్పించుకుంటూ!

"ఒకే స్త్రీ. రూపాలు వేరు, గుణాలు వేరు. కౌసల్య శాంతమూర్తి... కైక ఈర్ష్య నిండిన మనస్సు కలది..." దూరం నుంచి గాలిలో అలలు అలలుగా స్వామీజీ చెబుతున్న ప్రవచనం వినిపిస్తోంది.

ఎంత నిజం ఆ మాట!

ఒకే స్త్రీ... రూపాలు వేరు... లక్షణాలు వేరు.

అమ్మ.... నాన్న దాష్టీకాన్ని భరిస్తూ కన్నీళ్లని మింగి జీవించిన కారుణ్యమూర్తి.

సుహా-నాన్న దాష్టీకాన్ని మౌనంగానే ఎదిరిస్తూ సాహసంతో జీవించిన శాంతమూర్తి.

సుహాసినిని పై చదువులు చదువుతానని అడిగినప్పుడు, ఇంట్లో చాలా పెద్దగొడవే జరిగింది. ఎప్పుడూ నాన్నకి ఎదురుచెప్పని అమ్మ కూడా సుహా పక్షంలో మాట్లాడటం నాకు ఆశ్చర్యం కలిగించింది. స్త్రీ మనసు స్త్రీ మాత్రమే అర్థం చేసుకోగలదంటే ఇదేనేమో!

నాన్న అమ్మని రెండు చెంపలూ పగిలిపోయేలా కొట్టారు అప్పుడు. అప్పటికే నాన్న మీద నా మనస్సులో పెరిగిన కోపం అసహ్యంగా రూపుదిద్దుకుంది.



దెబ్బలు తిని కూడా ఒక్క కన్నీటి చుక్క రాల్చకుండా, ఆయన ముందే నా దగ్గరకొచ్చి, "నరేన్. సుహాని నువ్వే చదివించాలి. మీ నాన్న దానికి పెళ్లి చేస్తానంటున్నారు. చూశావుగా పెద్దనాన్నగారి, శివాని...పెళ్లయిన మూడేళ్లకే ముగ్గురు పిల్లల్ని కని కన్ను మూసింది. అతడికేం, దర్జాగా మరో పెళ్లి చేసుకున్నాడు. ఆ పిల్లలే తల్లి లేని వాళ్లయ్యారు. సవతితల్లి వచ్చిందంటే తండ్రి మూడోమనిషి కిందే లెఖ్ఖ! మన సుహా జీవితం అలా కావటానికి వీల్లేదు. మనింటి గౌరవం సుహా. నేను బతికుండగా దాన్ని బుగ్గిపాలు కానివ్వను. నువ్వు కూడా నాకు మాటివ్వు..." అంటూ నా చేయి తీసి తన తల మీద పెట్టుకుంది అమ్మ. నాకు ఆ క్షణంలో అమ్మ మీదున్న గౌరవం మరింత పెరిగింది!

తప్పకుండా నన్నట్లు తల ఊపాను.

నాన్న మాత్రం అహంకారంతో చెప్పారు. "నా జమీందారీకి ఏకైక వారసువాడు వాడు, నా నరేన్. నేను గీచిన గీటు దాటడు. సుహాకి పెళ్లి చేయటంలో నాకు అండగా నిలబడతాడు...ఆఁ!"

ఆ రాత్రే అమ్మ, నాన్నకు తెలియకుండా సుహాని తన స్నేహితురాలి ఇంటికి పంపేసింది. అక్కడ నుంచి ఆవిడ కూతురు కాదంబినితో కలిసి వారణాసి చేరుకుంది సుహాసిని.

"ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్..." సచ్చిదానందపరబ్రహ్మ పూర్ణత్వం గురించి చెపుతున్నారు స్వామి.

"అసూర్యానామ తే లోకా-"

అసురశక్తులూ... అంధకారమూ, అజ్ఞానమూ... బాధ వీటి నుంచి ముక్తి కలిగించేది కేవలం పరమాత్మ ధ్యానం మాత్రమే. బోలో భగవాన్ శ్రీరామచంద్ర కీ.. జై."

'ముక్తి...!'

ముక్తి అంటే ఏమిటి? మళ్లీ గతంలోకి వెళ్లింది నా మనస్సు.

ప్రాపంచికకర్మలను విడిచిపెట్టటమా? మన చుట్టుపక్కల వాతావరణం నుంచి పారిపోవటమా? కాదు!

"అనుభవాలు నిండి... పండిన మనస్సు, భౌతికతను మించి ఆత్మికతలో ప్రవేశించినప్పుడు (ఆధ్యాత్మికత) అప్పుడు తెరుచుకునేది ముక్తిద్వారం."

రాఘవానందస్వామి చెప్పిన ఆ మాటలు జీర్ణించుకునేందుకు చాలా సమయమే పట్టింది నాకు.

అప్పుడు కూడా నా కళ్ల ముందు అమ్మ-సుహా ఇద్దరూ నిల్చున్నారు.

సుహా వెళ్లిన మర్నాడు నాన్నలో మృగాన్ని చూశాను నేను. అమ్మని గొడ్డుని బాదినట్లు బాదారాయన. అమ్మ పల్లెత్తు మాట ఎదురు చెప్పలేదు. ప్రాణం లేని బొమ్మలా ఆ దెబ్బలు కాసింది. ఆ రాత్రే నేనూ వారణాసి వెళ్లిపోయాను.

రావు బహద్దూర్ సోమేశ్వరరావు జమీందారుకి ఏకైకవారసుడు భావి జమీందారు-నరేంద్రనాథుడు, తల్లిని, తండ్రి దాష్టీకానికి విడిచి పెట్టి పారిపోయి వచ్చాడు చదువు పేరుతో!

సమస్త జమీనూ-చాంద్‌బాయి అనే నాట్యకత్తె ఎదుట నైవేద్యంగా సమర్పించి మోకరిల్లిన సోమేశ్వరరావు, కన్నబిడ్డ సుహాసిని ఎక్కడ కనిపించినా కాల్చి చంపెయ్యమని తన మనుష్యులకి ఆజ్ఞ ఇచ్చాడు.

వారణాసిలోని విద్యాపీఠంలో చదువు పూర్తి చేసిన సుహాసినిని తన కోడలుగా చేసుకుంటానని నాకు కబురు పంపింది, లేటు రావుబహద్దూర్ గంగాధరం జమీందారుగారి భార్య.

వీరేంద్ర ఒక్కడే ఆవిడ సంతానం. భూగర్భశాస్త్రవేత్త అతడు.

నేను అమ్మ దగ్గరకు వెళ్లాను ఆ వార్తతో. అమ్మ కళ్లతోనే అంగీకారం తెలిపింది, ఏ భావమూ ప్రదర్శించకుండా.

ఆర్యసమాజంలో అగ్నిసాక్షిగా జరిగింది సుహా-వీరేన్‌ల వివాహం. సుహా అటునుంచి అటే అత్తవారింటికి వెళ్లిపోయింది. నాన్నకు ఆ విషయం తెలియకుండానే సంవత్సరం గడిచింది.

నా చదువు పూర్తయింది. మృణాళినితో నా వివాహం నిశ్చయమైంది.

ఆ సమయంలో జరిగింది అప్రత్యాసితంగా ఆ సంఘటన. నిండు గర్భిణి సుహా, వీరేన్‌తో కలిసి కలకత్తా వెళ్తూ ఉండగా చూసి, నాన్న మనుషులు, వాళ్లిద్దరూ రైలు దిగగానే తుపాకితో కాల్చి చంపేశారు. కాల్చినది ఇద్దరిని, బలైనది మూడు ప్రాణాలు!

చంపినవాళ్లు వచ్చి చెపుతూంటే విన్న అమ్మ చిత్తరువులా గోడకు అతుక్కుపోయింది. అంతలోనే మరో సంఘటన...

ఆ రాత్రి గంగాధరం జమీందారు గారి భార్య-వీరేన్ తల్లి బగ్గీ మీద మా ఇంటికి వచ్చింది రౌద్రరూపంతో.

నిట్టనిలువుగా నిల్చుని నాన్న మీద ఆవిడ హుంకరిస్తూంటే సాక్షాత్తూ మహిషాసురమర్దనిలా అనిపించింది.

అమ్మలో కరుణామూర్తినీ... సుహాలో శాంతమూర్తినీ మాత్రమే చూసిన నాకు, ఆమె స్త్రీలోని రౌద్రమూర్తిని చూపింది.

ఆమె మాట్లాడినంతసేపూ సుహాని... తన కోడలు తన ఇంటి వెలుగు అనే అన్నది తప్ప ఈ ఇంటి బిడ్డ అనలేదు. అది చాలు ఆవిడ సుహాని ఎంతగా ప్రేమించిందీ అర్థం చేసుకోవటానికి.

వెళ్తూ వెళ్తూ ఆవిడ మెట్ల మీద నిల్చుని కుడిచేతి తర్జని ఎత్తి నాన్నకి ఇచ్చిన శాపం... నా చెవులలో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

"సోమేశ్వరావు! స ఈక్షతే! పైవాడు చూస్తూ ఉంటాడు. వాడి సాక్షిగా నీకు శాపం ఇస్తున్నాను నీ వంశం నాశనమై పోతుంది. నీకు వారసులు ఉండరు. నీ పితృదేవతలు కూడా ఆహారం కోసం అలమటించిపోతారు. నా ఇంటిని ఈ స్థితి తెచ్చిన నీకూ నా గతే పడుతుంది. కడుపు కోతతో బాధపడుతూన్న ఒక స్త్రీ ఇచ్చిన శాపం ఇది! నీకు తప్పక తగులుతుంది."

తన డబ్బు ఎర చూపి ఒక స్త్రీని ఆటబొమ్మలా ఆడించిన నాన్న-

తన ముందు తల వంచిన స్త్రీని బానిసలాగా చూస్తున్న నాన్న-

తన ముందు తల ఎత్తిన స్త్రీని బలిపశువుగా చేసిన నాన్న-
తన ఎదుట హుంకరించిన స్త్రీని చూసి గడగడలాడిపోయాడు!

వణికిపోతూ నా దగ్గరకొచ్చి గట్టిగా తన హృదయానికి హత్తుకుంటూ "నరేన్...నరేన్...! అలా ఎన్నటికీ జరగదు నాన్నా! నువ్వు నా బిడ్డవి! నా జమీందారీకి ఏకైకవారసుడివి. నీకేమీ కాదు.. నీకేమీ కాదు" అంటూ రోదించసాగాడు.

"లేదు...అలాగే జరుగుతుంది- ఒక స్త్రీ హృదయవేదన కాదది ఒక శక్తి... మూడు రూపాలతో ఇచ్చిన శాపం అది! అమ్మగా సుహాగా వీరేన్ తల్లిగా ఆ శక్తి ఇచ్చిన ఆ శాపం... నువ్వూ, నీ బిడ్డగా నేనూ అనుభవించి తీరాలి!" అని గట్టిగా నిర్ణయించుకున్నాను నేను.

వెంటనే, ముందుగా వీరేన్ ఇంటికి వెళ్లాను-

ఆ భవనం చుట్టూ చీకట్లో భయంకరమైన నిశ్శబ్దం అలముకుని ఉంది. కీచురాళ్ల శబ్దం తప్ప మరేమీ వినిపించటం లేదు.


నేను వెళ్లిన అలికిడికి లోపల నుంచి ప్రశ్నించింది ఆవిడ-

"ఎవరు-?"

దీపం వెలిగించి తలుపు తీసింది.

"అరె... నరేన్... లోపలకు రా బాబూ!" అంటూ ఆహ్వానించింది.

నేను లోపలకు వెళ్తూనే ఆవిడ పాదాల మీద కూలిపోయాను. సంవత్సరాలుగా ఘనీభవించిన కన్నీరు కరిగి ఆవిడ పాదాలను అభిషేకిస్తోంది.



"ఆయన కొడుకుగా, నేను ఆయనకు వేయలేని శిక్ష-మీ శాపం ద్వారా నేను అమలుపరుస్తాను. నేను బ్రహ్మచారిగా ఉండిపోతాను. నాకు సంతానం వద్దు. జమీందారీ వద్దు. ఏమీ వద్దు. అయాచితంగా ఈ సంసారబంధనాల నుంచి ముక్తిని ప్రసాదించారు మీరు. తల్లీ, మీ కిదే నా ప్రణామం!" అంటూ నా మనస్సు మాటిమాటికీ ఆవిడ పాదాల వద్ద నివేదించుకుంటోంది.

"బాబూ... నేనెంత తప్పు చేశానో చూశావా? నేను కేవలం మీ నాన్ననే చూశాను. కానీ నిన్ను చూడలేదు. నువ్వూ మా వీరేన్ లాంటివాడివే! మృణాళినితో నీ వివాహం నిశ్చయమైందని తెలిసిం ది. కానీ కోపంలో మీ నాన్నని శపించాననుకున్నాను. కానీ అది నీకు తగులుతుందని గ్రహించలేకపోయానయ్యా. అదిగో మళ్లీ ఆ దైవసాక్షిగానే చెపుతున్నాను నిన్ను శాపం నుంచి విముక్తి చేస్తున్నా ను. వెళ్లు. హాయిగా పెళ్లి చేసుకో. పిల్లాపాపలతో వెయ్యేళ్లు చల్లగా వర్థిల్లు." అక్కడే కూర్చుని తల నిమురుతూ మెల్లగా చెప్పింది ఆవిడ!

అక్కడ రౌద్రమూర్తి... ఇక్కడ దయామూర్తిగా మారింది!

"వద్దు... నాలో ఉన్నది మా నాన్న రక్తం. దానికి మీ శాపం తగలవలసిందే! నా మీద ఇంత దయ చూపించవద్దు" నా మనస్సు ఘోషించింది.

ఏడుస్తున్న నన్ను విడిచి లోపలకు వెళ్లి, పటిక బెల్లం తెచ్చి నోట్లో వేసింది. చీర చెంగుతో నా ముఖం తుడుస్తూ "త్వరలోనే ఇంత తియ్యని కబురుతో వచ్చి నాకు కనిపించు. అప్పుడు నీకు మిఠాయి పెడతాను. వెళ్లు నరేన్. నీలో మా వీరేన్ కనిపిస్తున్నాడు నాకు. మళ్లీ మీ నాన్న కనిపించక ముందే ఇక్కడ నుంచి వెళ్లిపో" చెప్పింది కన్నీళ్లతో.

నేను లేచి వచ్చేశాను.

రాత్రంతా అమ్మ ఒడిలో తలపెట్టుకుని కూర్చున్నాను. బొమ్మలా జరుగుతున్నవన్నీ చూస్తూ ఉంది అమ్మ-ఆవిడ కళ్లల్లో నీళ్లు ఏ నాడో ఇంకిపోయాయి.

మరునాడు ఉదయం నేను మృణాళిని ఇంటికి వెళ్లాను. అప్పటికే ఆ ఇంట్లో అందరికీ, వీరేన్ తల్లి మా నాన్నకి ఇచ్చిన శాపం గురించి తెలిసింది. నన్ను చూసి కూడా, ఎరగనట్లు ముఖాలు తిప్పుకున్నారు. నేను మృణా కోసం చూస్తూ నిల్చున్నాను. ఇంతలో ఆమె బైటకు వచ్చింది. అందరూ చూస్తు ఉండగానే నా వద్దకు వచ్చింది.

"నీతో నా వివాహం నిశ్చయమైన రోజునే నేను నీ భార్యనయ్యాను. ఇప్పుడు నీ నిర్ణయం నేను కూడా సమర్థిస్తాను. నీతో పాటే నేనూ బ్రహ్మచర్యం పాటిస్తాను" ఒక చేతితో నా చేయి పట్టుకుని మరో చేయి నా చేతిలో వేస్తూ చెప్పింది.

"నాన్నా.... ఒకసారి వివాహం నిశ్చయమై, అది భంగమై నీ ఇంట్లో నేను ఉండటం కంటే, వివాహితగా ఆ ఇంట్లో ఉంటేనే నీకూ, నాకూ కూడా గౌరవం కదూ?" వాళ్ల నాన్నతో చెప్పింది.

స్త్రీలో నేను చూసిన మరో రూపం ఇది-సాహసరూపం!

మరణించిన సుహా ఈమె రూపంలో నాన్నను ఎదుర్కోవటానికి వస్తోందా అనిపించింది నాకు. అయితే సుహా జీవితం నుంచి పారిపోయి ఓడిపోయింది. మృణా జీవితాన్ని ఎదుర్కోటానికి ముందుకు వచ్చింది.

వివాహమైన రోజునే మృణా-నేనూ అనాథాశ్రమానికి వెళ్లి ఒక పాపను ఇంటికి తెచ్చుకున్నాము. ఆ పాపకు సుహాసిని అని పేరు పెట్టాము. అప్పటి నుంచీ అమ్మ ముఖంలో తిరిగి కాంతి ప్రవేశిస్తే, నాన్న నాతో మాట్లాడటం మానేశాడు.

చిత్రంగా మూడు నెలలు తిరగకుండా రైలు ప్రమాదంలో మరణించారు మృణా-సుహా బంధువుల పెళ్లికి వెళ్లి వస్తూ ఉండగా!

అమ్మ ఆ వార్త వినగానే గుండె ఆగి మరణించింది.

"శాపం...శాపం..." నాన్న వణికిపోతూ అన్నాడు.

"ఓం... సోమస్తృప్యతామిదమ్ జలం తస్మై స్వధా తస్మైస్వధా..." వృద్ధపురోహితుడు మంత్రాలు చదువుతూ ఉండగా

లేచాడు... రావు బహద్దూర్ సోమశ్వరరావు జమీందార్!

"ఆకాశం అంటుకుంటున్న ఈ మంటలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? అమ్మా... సుహా... వెళ్లకు... మంటల్లో కాలిపోతావు తల్లీ... వద్దమ్మా వెళ్లద్దు! నరేన్.. సుహాని ఆపు బాబూ... అదిగో శాపం... ఆ శాపంలో కాలిపోతోంది నా జమీందారీ అంతా... ఏకైక వారసుడివి. నాయనా రక్షించుకో... కాపాడుకో..." అంటూ కుప్పకూలిపోయాడు.

ఓం పృథివి శాంతిః అంతరిక్ష శాంతిః ఆపః శాంతిః

"జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున

"అర్జునా, జన్మ...కర్మ... అన్నీ అలౌకికమైనవి! అని భావించిన వాడు నన్నే నమ్ముకుని పునర్జన్మ బంధనం నుంచి విముక్తుడౌతాడు. నాలో లీనమైపోతాడు.'

"గతాసూ నగతాసూశ్చ నాను శోచన్తి పణ్డితాః" గతించిన వాడు... మిగిలినవాడు అంటూ శోకాన్ని పట్టించుకోడు. పండితుడైనవాడు రెండూ సమంగానే స్వీకరిస్తాడు.

పదిహేను రోజులలో నాలుగు మరణాలు.

నా చెల్లెలు సుహాసిని మరణమే నన్ను బాధించలేదు. నన్ను గన్న నా తల్లి మరణం నన్ను బాధించలేదు నా సహధర్మ చారిణి... కావాలని తెచ్చుకున్న బిడ్డ మరణిస్తేనే బాధపడలేదు. ఇక ఓ దుర్మార్గుడి మరణం నన్ను బాధించగలదా?

నిజమే!

"అనుభవాలతో నిండి... పండిన మనస్సు, భౌతికతను గమించి ఆత్మికతలో ప్రవేశించినప్పుడు అప్పుడు తెరుచుకునేది ముక్తిద్వారం" అని స్వామీజీ చెప్పిన మాట అక్షరసత్యం!

జమీందారీ అంతా విడిచిపెట్టేశాను. ఆస్తి రాఘవానందస్వామి ఆశ్రమానికి రాసి ఇచ్చాను. అక్కడే సమాజసేవలో జీవితం గడుపుతున్నాను. స్త్రీ జీవితాన్ని శాసించాలని చూస్తే ఎదురయ్యేది ఉపద్రవమేననీ, దానికి శాంతి లేదనీ

గీతా... గంగా... గోపూజ... వీటిలోనే మనస్సుకి శాంతి లభిస్తుందనే నిజం తెలుసుకున్నాను.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**